క్లుప్తంగా

పోలింగ్ బూత్‌లో కార్పొరేటర్ ప్రచారం



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న బీజేపీ, కాంగ్రెస్ నాయకులు

కాశిబుగ్గ: వరంగల్ 18వ డివిజన్ క్రిస్టియన్ కాలనీ గ్రెయిన్ మార్కెట్ స్కూల్‌లోని బూత్ వద్ద పోలింగ్ గడువు ముగుస్తున్న సమయంలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి స్థానిక కార్పొరేటర్ వస్కుల బాబు ప్రచారం చేశారు. ఇది గమనించిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కార్పొరేటర్‌ను బయటకు పంపాలంటూ నినాదాలు చేశారు. అప్పటికి అక్కడే ఉన్న పోలీసులు పట్టించుకోకపోవడంతో మూసి ఉన్న గేటును బద్దలు కొట్టి లోపలకు వెళ్లి వారితో వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకోవడంతో గొడవ సద్దుమణిగింది. పోలీసులు బూత్ వద్దకు చేరుకుని అక్కడున్న వారందరిని చెదరగొట్టారు.

ఓటు వేసిన వృద్ధులు, దివ్యాంగులు



వీల్‌చైర్‌లో వృద్ధురాలిని తీసుకొస్తున్న జబ్బార్

ఖిలా వరంగల్: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ ఎస్‌ఆర్‌ఆర్ తోటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో దివ్యాంగులు, వృద్ధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారికి తవక్కల్ వెల్ఫేర్ ట్రస్ట్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎంఏ.జబ్బార్ సహకారం అందించారు. వీల్ చైర్‌లో తీసుకుచ్చి ఓటు వేయించి తిరిగి ఇంటికి క్షేమంగా చేర్చారు.

ఓటుహక్కును వినియోగించుకున్న దివ్యాంగురాలు



కాజీపేట అర్బన్: ఓ దివ్యాంగురాలు వీల్ చైర్‌లో వచ్చి తన ఓటుహక్కును వినియోగించుకుంది. ఈమేరకు ఆమెను కడిపికొండకు చెందిన ఎల్లేష్ పోలింగ్ బూత్‌కు తీసుకుని వచ్చాడు.

ఓటు వేసిన ట్రాన్స్‌జెండర్లు

కరీమాబాద్: శాసనసభ ఎన్నికల్లో భాగంగా గురువారం జరిగిన పోలింగ్ ప్రక్రియలో ట్రాన్స్‌జెండర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వరంగల్ తూర్పులోని ఎస్‌ఆర్‌ఆర్‌తోట 111వ పోలింగ్ కేంద్రంలో వారు సామూహికంగా ఓటు వేశారు.

పైసలియ్యలే ఓటెయ్యం!



వరంగల్: 'రాత్రంతా జాగారం చేసినం. అధికార పార్టీ వాళ్లు పైసలియ్యలే. మేం ఓటెయ్యం' అని తూర్పు నియోజకవర్గ ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం వరకు వేచి చూసి పోలింగ్ సమయం ముగిసే గంట ముందు కేంద్రాలకు పోటెత్తారు. రెండ్రోజులుగా ప్రధాన పార్టీ అభ్యర్థి రూ.2 నుంచి 3 వేలు, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు రూ.వెయ్యి నుంచి 2 వేలు పంపిణీ చేస్తారని నియోజకవర్గంలో విస్తృత ప్రచారం జరిగింది. దీంతో రాజకీయ నాయకుల అనుయాయులు వచ్చి డబ్బులిస్తారని రెండ్రోజులుగా పలు వీధుల్లో ప్రజలు వేచి చూశారు. బుధవారం వరకు రెండు ఇతర పార్టీలకు చెందిన డబ్బులు ముట్టడంతో అధికార పార్టీ డబ్బుల కోసం ఎదురుచూశారు. ఈవిషయంపై అధికార పార్టీకి చెందిన డివిజన్, బూత్ నాయకులను వాడల్లో నిలదీయడంతో బుధవారం రాత్రి ఏసమయానికైనా అందుతాయని హామీ ఇచ్చారు. వారిచ్చిన హామీల మేరకు పలువురు ఇళ్ల ఎదుట లైట్లు వేసుకుని తెల్లవారుజాము వరకు కళ్లలో వత్తులేసుకుని వేచి చూశారు. తెల్లవారినా కూడా డబ్బులు అందకపోవడంతో ఓటర్లు ఎక్కువ మంది నిరాసక్తితో పోలింగ్ కేంద్రాలకు వెళ్లకుండా ఇళ్లలోనే ఉండిపోయారు. అధికార పార్టీతో పాటు ఇతర పార్టీల కేడర్ వాడల్లోకి వెళ్లి ప్రజల్ని పోలింగ్ కేంద్రాలకు తరలించేదుకు ప్రయత్నాలు చేశారు. చివరికి పోలింగ్ సమయం ముగుస్తుందనగా పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు.

మొరాయించిన ఈవీఎంలు

శాయంపేట: మైలారం మినహా మిగిలిన గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. గట్లకానిపర్తిలో మాక్ పోలింగ్ సమయంలో వీవీ ప్యాట్లు మొరాయించగా అధికారులు వాటిని మార్చి కొత్తవి ఏర్పాటు చేశారు. పోలింగ్ స్టేషన్ 316లో ఈవీఎం కొద్దిసేపు మొరాయించగా, వాటిని సరిచేశారు. సీఐ మల్లేష్, ఎస్సై దేవేందర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పోటెత్తిన ఓటర్లు

నగరంలో గురువారం జరిగిన శాసనసభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఓట్లు వేసేందుకు ఓటర్లు పోటెత్తారు. కొత్తగా ఓటు వచ్చిన యువతతో పాటు వృద్ధులు, దివ్యాంగులు ఓటు వేసేందుకు ఉత్సాహంగా కదిలివచ్చి ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటారు. ఉదయం 7గంటలకు మొదలైన పోలింగ్.. రాత్రివరకు కొనసాగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



న్యూశాయంపేట పోలింగ్ బూత్‌లో బారులుదీరిన మహిళా ఓటర్లు



ఓటు హక్కును వినియోగించుకున్న వృద్ధులు



హనుమకొండ జిల్లా ధర్మసాగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న పురుషులు, మహిళలు



ఓటు హక్కు వినియోగించుకున్న కుటుంబ సభ్యులు



ఖిలా వరంగల్ బాలాజీ పాఠశాలలో పోలింగ్ సమయం ముగిసిన అనంతరం ఇంకా ఓటు వేసేందుకు వేచిఉన్న ప్రజలు



సిరాచుక్కను చూపుతున్న కుటుంబ సభ్యులు



ఓటు వేసిన జంగా రాఘవరెడ్డి దంపతులు



ఓటు వేసేందుకు క్యూలో నిలబడిన ఓటర్లు



ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి భారీగా తరలివచ్చిన ఓటర్లు



బిడ్డతో వచ్చిన మహిళ



ఓటు వేసేందుకు క్యూలైన్‌లో ఉన్న పురుషులు, మహిళలు



ఓటు వేసేందుకు క్యూలైన్‌లో ఉన్న మహిళలు



ఓటు వేసేందుకు తరలివచ్చిన ఓటర్లు



పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు



బాపూజీనగర్‌లో ఓటరు లిస్ట్‌ను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ పశ్చిమ అభ్యర్థి వినయ్‌భాస్కర్

47, 48 డివిజన్లలో పోలింగ్

కాజీపేట రూరల్: 47, 48వ డివిజన్లలోని బాపూజీనగర్, డీజిల్‌కాలనీ, బోడగుట్ట, దర్గా, ఫాతిమానగర్‌లో ఎన్నికలు ప్రశాతంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీఆర్‌ఎస్ వరంగల్ పశ్చిమ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్, కాంగ్రెస్ పశ్చిమ అభ్యర్థి నాయిని రాజేందర్ రెడ్డి ఎన్నికల కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు.



డీజిల్‌కాలనీలో ఓటర్లతో మాట్లాడుతున్న కాంగ్రెస్ పశ్చిమ అభ్యర్థి నాయిని రాజేందర్‌రెడ్డి

'అరూరి గో బ్యాక్'



ఐనవోలు: మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామంలో ఎమ్మెల్యే అరూరి రమేష్ గో బ్యాక్ అంటూ కాంగ్రెస్ శ్రేణులు నినాదాలు చేశారు. గురువారం మండలంలో పలు పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. సింగారం, ముల్కలగూడెం, కొండపర్తి, వనమాల కనపర్తి గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను సందర్శించిన అనంతరం ఒంటిమామిడిపల్లికి చేరుకున్నారు. కాగా ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు అరూరి రమేష్ గోబ్యాక్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రెవెన్యూ గ్రామం కాకుండా ఎమ్మెల్యే రమేష్ అడ్డుకున్నాడని ఆరోపణలు చేస్తూ గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. పోలింగ్ స్టేషన్‌లోకి అరూరి వెలుతుండగా ఒక్కసారిగా కాంగ్రెస్ నాయకులు లోపలికి చొచ్చుకుని వచ్చారు. ఈ క్రమంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతల మధ్య వాగ్వాదం జరిగింది. ఒకరిపై ఒకరు చేయి చేసుకునే ఉద్రిక్త పరిస్థితి స్వల్పకాలంలో తలెత్తింది.

రాత్రి వరకు సాగిన పోలింగ్



ఓటు వేసేందుకు బారులుదీరిన ఓటర్లు



క్యూలో నిలబడిన మహిళలు



ఓటు వేసిన ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు కుటుంబ సభ్యులు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండంలోని పలు గ్రామాల్లో పోలింగ్ రాత్రి వరకు సాగింది. మండల కేంద్రంతో పాటు వంగపహాడ్, నాగారం గ్రామాల్లో ఓటు కోసం ఓటర్లు రాత్రి వరకు క్యూలో నిలబడ్డారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మందకొడిగా సాగిన పోలింగ్.. మధ్యాహ్నం తరువాత ఓటర్ల తాకిడి ఎక్కువైంది. ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఓటర్లు భారీగా తరలివచ్చారు. హసన్‌పర్తి మండల కేంద్రంలోని 26వ బూత్, 33వ బూత్‌ల్లో ఓటర్లు క్యూ కట్టారు. వంగపహాడ్, నాగారంల్లో బారులు దీరారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో కేవలం కేంద్ర బలగాలే విధులు నిర్వహించాయి. స్థానిక పోలీసులు కనిపించలేదు. రాత్రి 8గంటలకు పోలింగ్ ప్రక్రియ సాగింది.

పోలీసులపై ఆగ్రహం

అధికార పార్టీకి పోలీసులు సహకరిస్తున్నారని ప్రతిపక్ష పార్టీలు మండిపడ్డాయి. పోలింగ్ కేంద్రాల్లో అధికార పార్టీల నాయకులకు అనుమతి ఇస్తూ తమను నెట్టివేస్తున్నారని ప్రతిపక్షా పార్టీల నాయకులు ఆరోపించారు. మడిపల్లి, ఎల్లాపురంలో పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

కానిస్టేబుల్ ఓవర్ యాక్షన్

హసన్‌పర్తిలో ఓ కానిస్టేబుల్ ఓవర్‌యాక్షన్ చేశాడు. పోలింగ్ కేంద్రాలకు దూరంగా ఉన్న షాపులను కూడా బంద్ చేయాలని హుకుం జారీ చేశాడు. లేకుంటే కేసులు నమోదు చేస్తానని హెచ్చరించాడు. పోలింగ్ కేంద్రాలకు షాపులు దూరంగా ఉన్నప్పటికీ ఎందుకు బెదిరింపులకు గురి చేస్తున్నారని షాపుల నిర్వాహకులు ప్రశ్నించారు. సదరు కానిస్టేబుల్ వ్యవహారంపై ఉన్నతాధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు.

నరేందర్‌పై కేసు నమోదు

రామన్నపేట: ఎన్నికల నియమావళి ఉల్లంఘన కింద ఎమ్మెల్యే నరేందర్‌పై కేసు నమోదు చేసినట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. వరంగల్ దుర్గేశ్వరస్వామి గుడి వీధి శాంతినికేతన్ హైస్కూల్‌లోని 44వ పోలింగ్ బూత్‌లో పోలింగ్ సరళిని పరిశీలిస్తూ ఫోన్‌లో మాట్లాడిన నరేందర్.. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించారు. దాంతో ఎమ్మెల్యే నరేందర్‌పై మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లో ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ ఇన్‌చార్జ్ కే.రాజయ్య ఫిర్యాదు చేయగా గురువారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

ఓటు వేసి వస్తుండగా ప్రమాదం

గీసుకొండ: కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి ఆర్చ్‌గేట్ సమీపంలో వరంగల్–నర్సంపేట రహదారిపై గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఖానాపురం మండలం రంగంపేటకు చెందిన వి.రవీందర్, ఆయన భార్య మానస, కుమారులు హర్షవర్ధన్, చైతన్య గ్రామంలో ఓటు వేసి వస్తుండగా సాయంత్రం వరంగల్ వైపు నుంచి వస్తున్న వారి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో మానసకు తీవ్ర గాయాలు కాగా, మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి.

విలీన గ్రామాల్లో ప్రశాంతంగా ఎన్నికలు



మడికొండ ప్రభుత్వ పాఠశాలలోని బూత్‌లో..



ఎన్నికల సరళిని తెలుసుకుంటున్న అరూరి రమేశ్

మడికొండ: కాజీపేట మండలంలోని మడికొండ, తరాలపల్లి, భట్టుపల్లి, కొత్తపల్లి, కడిపికొండ, టేకులగూడెం, అమ్మవారిపేట మడికొండ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 7గంటలకు పోలింగ్ మొదలైంది. మధ్యాహ్న వరకు మందకొడిగా జరిగిన పోలింగ్.. ఆ తర్వాత పుంజుకుంది. పలు గ్రామాల్లో ఓటర్ స్లిప్‌లు అందక ఓటర్లు అయోమయానికి గురయ్యారు. విలీన గ్రామాల్లోని 31పోలింగ్ బూత్‌ల్లో 31,836 మంది ఓటర్లకు 22,839 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మడికొండ పోలీసు స్టేషన్ పరిధిలో 70.07 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఓటింగ్ సరళిని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేష్, బీజేపీ అభ్యర్థి కొండేటి శ్రీధర్‌తో పాటు అధికారులు పరిశీలించారు. ఎన్నికల భద్రతను మడికొండ ఇన్‌స్పెక్టర్ వేణు, ఎస్సైలు దివ్య, రాజబాబు, పోలీసు సిబ్బంది పర్యవేక్షించారు.



ఈవీఎంలను సీజ్ చేసి కేంద్రాలకు తరలిస్తున్న ఎన్నికల అధికారులు

కాజీపేట పట్టణంలో తరలొచ్చిన జనం



కాజీపేటలో కార్యకర్తలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి నాయిని రాజేందర్‌రెడ్డి



ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్

కాజీపేట: కాజీపేట పట్టణంలోని పలు డివిజన్లలో గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్ పర్యవేక్షణలో సాయుధ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణంలో సమస్యాత్మక ప్రాంతాలైన దర్గా కాజీపేట, సోమిడి, బాపూజీనగర్, బాబుక్యాంపుల్లో సాయుధ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సీఐ సార్ల రాజు పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు. ఆదిలోనే గంటసేపు ఈవీఎంలు మొరాయించాయి. దీంతో ఓటర్లు ఇబ్బంది పడ్డారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్, కాంగ్రెస్ అభ్యర్థి నాయిని రాజేందర్ రెడ్డి, బీజేపీ అభ్యర్థి రావు పద్మ ఓటింగ్ సరళిని పరిశీలించారు. కాజీపేటలో క్రైస్తవ పీఠాధిపతి బిషప్ ఉడుముల బాల, ప్రశాంత్‌నగర్ కాలనీలో ఎమ్మెల్యే అరూరి రమేష్, రిటైర్డ్ ప్రొఫెసర్ పాండు రంగారావు ఓటు వేశారు.



వృద్ధురాలిని తీసుకొస్తున్న కుటుంబ సభ్యులు

పంచింది తక్కువ.. నొక్కింది ఎక్కువ

అసెంబ్లీ ఎన్నికల్లో బరిలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల నిర్వహణ ఖర్చుల కోసం ఇచ్చిన డబ్బుల్లో నాయకులు, కార్యకర్తలు కొంచెం పంచి.. ఎక్కువ మొత్తం నొక్కివేశారనే విషయం కాజీపేట పట్టణంలో చర్చనీయంశంగా మారింది. రాజకీయ పార్టీల మధ్య తీవ్ర స్థాయిలో పోటీ నెలకొనడంతో నాయకులు పరస్పరం నిఘా పెట్టారు.

ఖిలా వరంగల్‌లో కదిలిన ఓటర్లు



పడమర కోటలో పోలింగ్ కేంద్రంలో 5గంటలకు క్యూలైన్లలో ఉన్న ఓటర్లు



ఓటు హక్కును వినియోగించుకున్న ట్రాన్స్‌జెండర్స్ ప్రతినిధి గౌతమి, తదితరులు

ఖిలా వరంగల్: వరంగల్ అండర్ రైల్వేగేట్ ప్రాంతాల్లో జరిగిన సార్వత్రిక ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఖిలా వరంగల్ త్రికోట, శాంతినగర్, శివనగర్, శంభునిపేట, ఎస్‌ఆర్‌ఆర్ తోట, విద్యానగర్, ఏకశిలనగర్‌తోపాటు విలీన గ్రామాల్లోని ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వరంగల్ 33వ డివిజన్ ఎస్‌ఆర్‌ఆర్ తోటలోని వాణి విద్యానికేతన్ హైస్కూల్‌లో ట్రాన్స్‌జెండర్స్ అసోసియేషన్ రాష్ట్ర నేత లైలా ఆధ్వర్యంలో 335 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. శాంతినగర్‌లోని సన్‌రైజ్ స్కూల్‌లోని బూత్‌లో ట్రాన్స్‌జెండర్ ప్రతినిధి గౌతమి ఆధ్వర్యంలో పలువురు ట్రాన్స్‌జండర్లు ఓటు వేశారు.

ఓటర్ల చైతన్యమే విజయానికి తోడ్పాటు

రాజ్యాంగ కల్పించిన ఓటు హక్కును ఓటర్లందరూ వినియోగించుకోవాలి. ఓటు అనేది ఓ వజ్రాయుధం లాంటిది. ఎన్నికల సంఘం ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపునిచ్చింది. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేసినప్పుడే మంచి నాయకుడిని ఎన్నుకోగలుగుతాం.

– లైలా, ట్రాన్స్‌జెండర్స్ ప్రతినిధి

సాగర్ ఎడమకాల్వలో జారిపడి వ్యక్తి మృతి

మునగాల(కోదాడ): సాగర్ ఎడమకాల్వలో ప్రమాదవశాత్తు జారిపడి ఓ వ్యక్తి మృతిచెందాడు. వరంగల్ జిల్లాకు చెందిన అజ్గర్ అలీ(48) భార్య షహనాజ్ సూర్యాపేట జిల్లా నడిగూడెం గురుకుల పాఠశాలలో కాంట్రాక్ట్ వైద్యురాలిగా పనిచేస్తోంది. దీంతో అజ్గర్ అలీ కుటుంబం కొంత కాలంగా మునగాల మండలంలోని బరాఖత్ గూడెంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. గురువారం సాయంత్రం అజ్గర్ అలీ తన కుమార్తెను తీసుకొని మునగాల శివారులోని సాగర్ ఎడమకాల్వలో స్నానం చేసేందుకు వెళ్లాడు. కుమార్తెకు స్నానం చేయించి ఒడ్డున కూర్చోబెట్టి తనూ స్నానం చేసేందుకు ఉపక్రమించాడు. ఈ క్రమంలో అజ్గర్ అలీ కాలుజారి కాల్వలో పడి మునిగిపోయాడు. కుమార్తె కేకలు వేయడంతో పరిసర ప్రాంతానికి చెందిన రైతులు కాల్వలోకి దిగి వెతకగా అజ్గర్ మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మునగాల పోలీసులు తెలిపారు.